www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 15 మే 2025

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

హాస్టల్‌లో దోమల నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో బుధవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దోమల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. వసతి గృహం గదుల లోని గోడలకు ఎసిఎం ఐదు శాతం మందు ద్రావణాన్ని పిచికారీ చేశారు. దోమల నిర్మూలన మందు ప్రభావం విద్యార్థులకు చూపకుండా సెలవుల్లో ఈ కార్యక్రమాన్ని చేపడతామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పలగుప్తం పిహెచ్‌సి వైద్యాధికారి ఎల్.నాగార్జున, హాస్టల్ వార్డెన్ రోజా పుష్ప, సూపర్ వైజర్ ఐ.చిట్టిబాబు, హెచ్ వి జి.కమల, ఎఎన్ఎం పి.రాధా సలూజా, ఆశా కార్యకర్తలు డి.పార్వతి,డి.వరలక్ష్మి పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అధికారులు

నాడు 6.. నేడు 9

- పాలకులు వేరైనా విధానాలు అవే
- 9 రకాల పాఠశాలలతో తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి - అమలాపురం

పాలకులు మారుతున్నారు గాని, వారి విధానాలు మారలేదు అనడానికి తాజాగా కూటమి సర్కారు విడుదల చేసిన జిఒలు 19, 20, 21లే నిదర్శనంగా ఉన్నాయి. గత వైసిపి సర్కారు కేంద్రంలో మోడీకి తలొంచి జిఒ 117ను తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థను నిర్వీర్యం చేసింది. ఆ సమయంలో వైసిపి సర్కారుపై టిడిపి, జనసేన అధినేతలు నిప్పులు చెరిగారు. తాము అధికారంలోకి వస్తే ఆ జిఒ 117ను రద్దు చేసి పాఠశాలలను యథావిధిగా కొనసాగిస్తామని ప్రకటనలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఆ మాట మరిచారు. పైగా అదే రకం పాఠశాలల విద్యావ్యవస్థను తీసుకొచ్చి మరిన్ని సమస్యలను తెచ్చిపెట్టారు.

విద్యార్థుల ప్రవేశాలు పెంచేదుకు, బడి మానేస్తున్న వారి సంఖ్య తగ్గింపు, సబ్జెక్టు ఉపాధ్యాయులపై పని భారం తగ్గించడం, అభ్యసన సామర్థ్యాలను పెంచేదుకు అంటూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో నూతన విధానాన్ని ప్రవేశ పెట్టింది. దీనిలో భాగంగా 9 రకాల పాఠశాలలతో పాటు క్లస్టర్ అకడమిక్ టీచర్ల విధానాన్ని తీసుకొచ్చింది. వైసిపి ప్రభుత్వంలో తెచ్చిన 6 రకాల స్థానంలో కూటమి సర్కారు 9 రకాల బడుల వ్యవస్థ తీసుకురానుంది. ఈ విధానంలోనూ పలు పాఠశాలలు మూతపడే అవకాశం ఉందని అభిప్రాయం వినిపిస్తోంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సవరించిన గణాంకాల ప్రకారం శాటిలైట్ స్కూల్స్ 8, ఫౌండేషనల్ స్కూల్స్ 500, బేసిక్ ప్రైమరీ స్కూల్స్ 1723, మోడల్ ప్రైమరీ స్కూల్స్ 786, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ 114, హై స్కూల్స్ 500, హై స్కూల్ ప్లస్ బిపిఎస్ (1-10/1-12) 79 స్కూల్స్, హై స్కూల్ ప్లస్ ఎంపిఎస్ (1-10/1-



12)

62 స్కూల్స్ మొత్తంగా 3,772 ఉన్నాయి. ఐదు నుంచి పదిమంది సంవత్సరాలు పనిచేస్తున్న లాంగ్ స్టాండింగ్ ఉపాధ్యాయులు 2,600 మంది, నిర్దిష్టమైన ఖాళీలు 1300, రేషనలైజేషన్ తర్వాత ఖాళీలు 2,500 మంది ఉన్నారు.

గత వైసిపి ప్రభుత్వం విద్యారంగంలో వినాశకర నిర్ణయాలు తీసుకుంటుంటే, అంతకుమించి అన్నట్లుగా కూటమి సర్కారు వ్యవహరిస్తోంది. గత సర్కారు జిఒ 117తో 3,4,5 తరగతులను విలీనం చేసింది. దీంతో అనేకమంది విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలకు బాట పట్టారు. ఎన్నికల ముందు కూటమి హామీలు ఇచ్చిన వాటిల్లో భాగంగా 117 జీవోను కూడా రద్దుచేసి విద్య విధానాలను సరిదిద్దుతామని కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసింది. కాని దాని విరుద్ధంగా మరిన్ని పాఠశాలలను మూసివేసే దిశగా కొత్త విద్యా విధానాన్ని తెరపైకి తెచ్చింది. దీని కోసం జిఒ 19, 20, 21లను విడుదల చేసింది.

ఫౌండేషన్ స్కూల్స్ పేరుతో 1,2 తరగతులకు మాత్రమే పాఠశాలలను పరిమితం చేసి రాబోయే రోజుల్లో అనేక పాఠశాలలు మూతపడే దిశగా ఈ ప్రభుత్వ విద్యా విధానాలు ఉన్నాయని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నూతన విద్యా విధానం వల్ల సింగిల్ డిజిట్స్ స్కూల్స్ పెరుగుతాయి. భవిష్యత్తులో ఆ పాఠశాలలు మూతపడే అవకాశం ఉంది. ఉదాహరణకు పెద్దాపురం పట్టణంలోని కొన్ని పాఠశాలలను పరిశీలిస్తే ప్రస్తుతం ఆరు సింగిల్ డిజిట్ స్కూల్స్ నాలుగు డబల్ డిజిట్ స్కూల్స్ ఉన్నాయి. చాలాక్య మున్సిపల్ హైస్కూల్లో 1,2 మినహా మిగిలిన 3,4,5 తరగతులను సమీపంలోని వేరే పాఠశాలకు మెర్జ్ చేయడంతో ఈ రెండు తరగతుల్లో ఆరుగురు మాత్రమే విద్యార్థులు ఉన్నారు. ఎన్ఎస్ మున్సిపల్ హైస్కూల్లో ఏడుగురు, బి.వి.ఆర్ హైస్కూల్లో 1,2 తరగతుల్లో ఆరుగురు, ఎమ్మెస్ మున్సిపల్ హై స్కూల్లో 1,2 తరగతుల్లో ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఆజాద్ ఉర్దూ పాఠశాలలో 1,2 తరగతుల్లో ఐదుగురు, ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూల్లో 1,2 తరగతిలో ఒక్కరు కూడా లేరు. భవిష్యత్తులో ఈ పాఠశాలలు మూతపడతాయి. ఇలా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో సింగిల్, డబుల్ డిజిట్ స్కూల్స్ గా మారనున్నాయి. అవి క్రమంగా మూతబడతాయి. ఈ విధానం పేద, బడుగు, బలహీన వర్గాల చదువుకే చాలా తీవ్ర విఘాతం కలిగిస్తుంది. ఉపాధ్యాయులకు పని భారాన్ని తగ్గిస్తామని వాగ్దానం చేసిన ఈ ప్రభుత్వం ఒక్కొక్క ఉపాధ్యాయుడికి 36 నుంచి 40 పీరియడ్లు వారానికి బోధన ఇవ్వడం ద్వారా నాణ్యమైన బోధన జరిగే పరిస్థితి లేదు. అలాగే సబ్జెక్టులకు సిలబస్ ఆధారంగా కావాల్సిన పీరియడ్ల కన్నా తక్కువ కేటాయించి ఎక్కువ తరగతులను తక్కువ మంది ఉపాధ్యాయులతో బోధన జరిగే విధంగా వర్కులోడును రూపొందిస్తున్నారు. అదేవిధంగా తరగతికి 60 మంది విద్యార్థులు దాటితేనే రెండో సెక్షన్ ఇస్తున్నారు. వీటన్నిటి ద్వారా నాణ్యమైన విద్య అందించే అవకాశం కోల్పోయే విధంగా ఉంది.

తరగతికి 45 మంది విద్యార్థులు పరిమితం చేసి ఉపాధ్యాయుల సంఖ్యను కేటాయింపు చేయాలని యుటిఎఫ్ వంటి ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులని కేటాయించాలని కోరుతున్నారు. హైస్కూల్, హై స్కూల్ ప్లస్‌లకు గతంలో పిజిటిలను కేటాయించారు. ప్రస్తుతం పిజిటి ప్రమోషన్స్ ఇవ్వడం ద్వారా రెగ్యులర్ ఉపాధ్యాయులు నియమించి హై స్కూల్ ప్లస్‌లను దీర్ఘకాలం కొనసాగించే విధంగా ప్రణాళిక రూపొందించాల్సిందిగా కోరుతున్నారు.

తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రం అయి ఉండి తెలుగు మాధ్యమంలో చదువుకోవడానికి విద్యార్థికి అవకాశం లేకుండా అన్ని పాఠశాలలను పూర్తిగా ఇంగ్లీష్ మీడియంగా మార్చి నిర్బంధ ఇంగ్లీష్ మీడియంను అమలు చేస్తున్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తిగా విరుద్ధంగా ఉంది. తక్షణం అన్నీ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలో సమాంతరంగా బోధన కొనసాగాలని పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులను కేటాయించాలి

ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులను కేటాయించాలి హైస్కూల్ లో 1:45 నిష్పత్తిలో ఉపాధ్యాయులను కేటాయించాలి. ప్రాథమిక పాఠశాలల్లో హెచ్ఎంలుగా ఎస్జిటీలకు ప్రమోషన్ ఇచ్చి నియమించాలి. హై స్కూల్ ప్లస్ లకు పిజిటి ప్రమోషన్ ద్వారా రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలి. తెలుగు రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయడం చాలా శోచనీయం. ఎన్నికల ముందు డిప్యూటీ సీఎం ఇచ్చిన హామీ మేరకు ఒక విద్యార్థి చేరిన తెలుగు మాధ్యమాన్ని నడిపే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- తోటకూర రవి చక్రవర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ఉన్నత విద్యాభ్యాసానికి సహకరిస్తాం



ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న జెసి

ప్రజాశక్తి - అమలాపురం

ఉన్నత విద్యాభ్యాసానికి జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిం చి భరోసాగా ఉండి అండగా నిలుస్తుందని జెసి టి.నిషాంతి మెరిట్ విద్యార్థు లకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో అధిక మార్కులు పొందిన విద్యార్థిని, విద్యార్థులను జెసి చేతుల మీదుగా నిఘంటువులు బహూక రించి ఘనంగా సన్మానించారు ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిభా వంతులైన విద్యార్థు లను అభినందించడం చాలా ముఖ్యమని, వారి కృషి, పట్టుదల, అంకితభావానికి ఈ ప్రశంసలు ఒక చిన్న గుర్తింపుగా నిలుస్తాయన్నారు. మెరిట్ సాధించిన విద్యా ర్థులందరికీ ఆమె అభినందనలు తెలిపారు విద్యార్థుల అద్భుతమైన విజయాలు జిల్లా విద్యాశాఖ పనితీరుకు నిదర్శనమని. ఈ విజయాలు పాఠశాలకే కాకుండా, మీ కుటుంబానికి కూడా గర్వకా రణంగా నిలుస్తారన్నారు. విద్యార్థిని, విద్యార్థులు భవిష్యత్తులో ఏయే ఉన్నత చదువులు అభ్యసించాల నుకుంటున్నారన్న విషయాలను ఆమె అడిగి తెలుసుకున్నారు.మీరు భవిష్యతులో కూడా ఇలాంటి విజయాల పరంపరను ప్రతి దశలో సాధించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు విద్యా ర్థుల కలలు ఆశయాలు సాకారం కావాలని ఆకాంక్షిస్తూ ఆమె శుభాకాంక్షలు తెలిపారు.ఈ విజయం కేవలం విద్యా ర్థుల ఒక్కరిదే కాదనీ. మీకు సహకరించిన మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రేయోభిలాషులందరికీ కూడా అభినందనలు తెలిపారు. ప్రతి దశలో టాపర్గా నిలవాలని సూచిం చారు కెరీర్ గైడెన్స్ కొరకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సవితకు చేనేత కార్మిక సమస్యలు వివరిస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - మండపేట

నియోజకవర్గం చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరిం చాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. బుధవారం విజయవాడ ఎ1 కన్వెన్షన్ సెంటర్ నందు రాష్ట్ర చేనేత ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖా మంత్రి ఎస్ సవిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మండపేట నియోజకవర్గ చేనేత కార్మికులతో మంత్రి సవితను కలిసి చేనేత కార్మికుల సమస్యలను వివరించి, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై మంత్రి సవిత సానుకూలంగా స్పందించినట్లు ఎంఎల్‌ఎ వేగుళ్ల తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

పుస్తకం పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. బుధవారం కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులను విద్యార్థులు సదివినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారిని మాట్లాడుతూ పలు అంశాలపై విద్యార్థులకు, వేసవి శిక్షణ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, గ్రంథాలయ పాలకరాలు శివ కుమారి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు .

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - మండపేట

గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఏడాది పూర్తయిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయక ఘోరంగా విఫలమైందని అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఛైర్మన్ కామన ప్రభాకరరావు ఆరోపించారు. మండపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏడాది కాలం లో కనీసం 10 శాతం హామీలు కూడా కూటమి నాయకులు నెరవేర్చలేకపోయారన్నారు. ఏడాది కాలంలో మూడు గ్యాస్ సిలిండర్ లు ఉచితంగా ఇవ్వాల్సి ఉండగా ఒక్క సిలిండర్ మాత్రమే ఇచ్చారని, అది కూడా కొందరికి ఇవ్వకుండా మొండి చేయి చూపారని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ఏమైందని ప్రశ్నించారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని నమ్మించి ఓట్లు వేయించుకున్నారని, ఇప్పుడు పథకం మాట పూర్తిగా విస్మరించారన్నారు. తల్లికి వందనం ప్రతి బిడ్డకు ఇస్తామన్న నిధులు ఏమయ్యాయని, నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని , నిరుద్యోగ భృతి కల్పిస్తామని ప్రభుత్వం నమ్మించి యువత ఓట్లు దక్కించుకున్నారని అన్నారు. వారికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రైతులకు ఏటా ఇస్తామన్న రూ.20 వేలు సహాయం మాట ఎవరూ ఎత్తడంలేదన్నారు. అటు కేంద్రం లో మోడీ, ఇటు రాష్ట్రం లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ముగ్గురూ ఇచ్చిన హామీలు నెరవేర్చ లేదని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం



వైద్య శిబిరంలో సేవలను పరిశీలిస్తున్న ఎంపీ హరీష్

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గ్రామాల్లో పేదల ఆరోగ్యం కొరకు దాతలు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాదుర్ అన్నారు. గొల్లవిల్లి నిమ్మకాయల చినరాజప్ప కళ్యాణ మండపంలో బుధవారం అమలాపురం కు చెందిన కాపు ఉద్యమ నేత కి.శే నల్లా సూర్యచంద్రరావు కుమారుడు నల్లా అజయ్ పుట్టినరోజు సందర్భంగా నల్లా సూర్యచంద్రరావు సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విజయవాడ నారాయణరెడ్డి పివిఆర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎంపీ హరీష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా అజయ్‌చే ఎంపీ హరీష్ పుట్టినరోజు కేక్ కట్ చేయించి మిఠాయిలు పంచిపెట్టారు. వైద్య శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు సుమారు 300 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు .అలాగే గుండె సంబంధిత రోగులను చికిత్స నిమిత్తం విజయవాడ తీసుకువెళ్లారు. కార్యక్రమంలో సన్నవిల్లి సర్పంచ్ చిక్కం పెదబాబు, మాజీ జడ్‌పిటిసి సభ్యుడు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, నాయకులు చీకట్ల అబ్బాయి, కల్వకొలను తాతాజీ,యాళ్ల నాగ సతీష్, నల్లా శ్రీధర్, ఇసుకపట్ల రఘుబాబు, గుత్తాల సుభాష్ చంద్రరావు, ఆకుల సూర్య నారాయణమూర్తి, రవణం మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలం లోని అనాతవరం గ్రామానికి చెందిన పేరూరి మహాలక్ష్మి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ సభ్యత్వం కలిగిన మృతురాలి కుటుంబానికి మంజూరైన రూ.ఐదు లక్షల ప్రమాద బీమా చెక్కును బుధవారం ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బారాజు చేతులు మీదుగా మృతురాలి భర్త నాగరాజు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రమాద వశాత్తు మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను ప్రమాద బీమా చెక్కు ద్వారా ఆదుకుంటామన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పేరూరి మహాలక్ష్మి టిడిపి సభ్యత్వం కలిగి ఉండటంతో మంజూరైన ప్రమాద బీమా రూ.ఐదు లక్షల చెక్కును ఆమె భర్త నాగబాబుకి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో గొలకోటి దొరబాబు అర్థాని శ్రీనివాసరావు, దాట్ల పధ్వి రాజు, కురసాల శివబాబు, మిమ్మితి చిరంజీవి, శీలం వెంకటేశ్వరరావు, పేరిచర్ల సురేష్ రాజు, పెయ్యల వెంకటరమణ, అందే శ్రీను, ఇళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా అక్రమ తవ్వకాలు నిలిపివేయాలి



మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బోసురాజు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న అక్వా చెరువు అక్రమ తవ్వకాలను నిలుపు చేయాలని నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ వేటుకూరి బోసురాజు మత్స్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నగర పంచాయతీ పరిధిలోని చిప్పలపాలెం 14వ వార్డులో నివాస ప్రాంతాలను అనుకుని కొంతమంది ఆక్వా చెరువు అక్రమ తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపిస్తూ బుధవారం నగర పంచాయతీ పరిధిలోని మార్కెట్ యార్డు నందు గల మత్స్య శాఖ కార్యాలయంలోని టెక్నికల్ అసిస్టెంట్ త్రిమూర్తులుకు మెమెరాండం అందజేశారు. అనుమతి లేకుండా తవ్వకాలు చేపడుతున్న ఆక్వా చెరువు అక్రమ తవ్వకాలను తక్షణమే నిలుపుచేసే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, రైతులు డిమాండ్ చేశారు. ఆక్వా చెరువు అక్రమ తవ్వకాల వల్ల పచ్చని మాగాణి పంట పొలాల సరిహద్దున ఉన్న పంట పొలాలు ఉప్పు నీటి కయ్యలుగా మారి తమకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు కాపీని కలెక్టర్, ఆర్‌డిఒ, మత్స్యశాఖ ఉన్నత అధికారులకు పంపించామని బోసురాజు పేర్కొన్నారు. ఆయన వెంట గ్రామస్తులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

- అధికారులతో జెసి సమావేశం
- పలు అంశాలపై సమీక్ష

ప్రజాశక్తి - అమలాపురం

రెవెన్యూ, జాతీయ రహదారుల అధికారులు సమన్వ యంతో 216 జాతీయ రహదారి నిర్మా ణంలో ఉత్పన్నమైన భూ సమ స్యలను అధిగమించి రోడ్డు నిర్మాణానికి చర్యలు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జాతీయ రహదారులు రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్‌హెచ్ 216 నిర్మాణ పనులు భూసేకరణ, అవార్డులు, నష్టపరిహారాల చెల్లింపు అంశాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కార దిశగా ముందడుగు వేయాలని సూచించారు. అమలాపురం - భట్నవిల్లి రోడ్డు వెంబడి డ్రెయినేజీ నిర్మించాలని సూచించారు. నష్టపరి హారాలను భూ యజ మాన్యాలకు జాప్యాలకు తావులేకుండా త్వరితగతిన చెల్లించాలని జాతీయ రహదారులు అధికారులకు సూచించారు. రాజోలు మండలంలో ఎన్‌హెచ్ 216 మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు రోడ్డు భద్రత హెచ్చరిక బోర్డులు ఏర్పాటు వంటి భద్రతా చర్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమాలలో డిఆర్‌ఒ రాజకుమారి జాతీయ రహ దారులు అథారిటీ పథకసంచాలకులు సాయి శ్రీనిఎ, డిఇఒ షేక్ సలీం బాషా, పబ్లిక్ పరీక్షల సూపరింటెండెంట్ హనుమంతరావు, ఉపవిద్యాశాఖ అధికారి జివివి.సుబ్రహ్మణ్యం, పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

కంప్యూటర్ పరీక్షలో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - ఐ.పోలవరం

కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జి.మూలపొలం గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న యర్రగురువు గ్రామంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించి 30 రోజులు పూర్తయింది. ఈ సందర్భంగా బుధవారం కలియుగ పాండవులు ఆధ్వర్యంలో పంచాయితీ వైస్ ప్రెసిడెంట్ కాశి షర్మిల, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు రేవు అప్పల స్వామి, అప్పారావు సమక్షంలో కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు థీరి పరీక్ష నిర్వహించారు. మొదటి స్థానంలో నల్లుగురు పోతుల సామ్ చందర్, కాలాడి హారిక, వనమాడి ఈశ్వరుడు,ఉండ్రు రాంజి, ద్వితీయ స్థానంలో ఏడుగురు, తతీయ స్థానంలో పదిహేను మంది విద్యార్థులు విజయం సాధించారు. వీరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు..ముందుగా అక్కడ ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి శాలువా కప్పి, పూలదండ వేసి నివాళ్లుల్పంచారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి గంగాధర్, మెల్లం సత్యనారాయణ, రేవు చినధనరాజు, బీర సత్యనారాయణ, బాల ఆనందకుమార్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నాణ్యమైన విద్యకు చిరునామా శ్రీ సాయి స్కూల్

ప్రజాశక్తి -ఐ .పోలవరం

మండలంలోని మురమళ్లలో 35 ఏళ్ల క్రితం స్థాపించిన శ్రీ సాయి స్కూల్ నాణ్యమైన విద్యకు చిరునామాగా మారిందని, ఈ ఏడాది వచ్చిన ఫలితాలే దీనికి నిదర్శనమని, పాఠశాల కరస్పాండెంట్ పెన్మెత్స వాసురాజు, (పికెఆర్) 'ప్రజాశక్తి'కి వివరించారు. 1989లో 40మంది విద్యార్థులతో అద్దె భవనంలోకి ప్రారంభించిన సాయి పాఠశాల నేడు 500మందికి పైగా విద్యార్థులతో సువిశాలమైన తరగతి గదులు కలిగిన సొంత భవనంలోకి మారే స్థితికి ఎదిగిందని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పటిష్టమైన ప్రణాళికను అనుసరిస్తూ విద్యార్థిని, విద్యార్థులను అత్యున్నత స్థాయికి చేర్చడమే లక్ష్యంగా విద్యా ప్రమాణాలతో నడపబడుచున్న ఏకైక విద్యా సంస్థ అని చెప్పారు. మేము అతి తక్కువ ఫీజులతో ప్రాథమిక స్థాయి నుంచి చిన్నారులకు అన్ని కాంపిటేటివ్ పరీక్షలకు ఉపయోగపడేలా క్వాలిటీ విద్య నందిస్తున్నామన్నారు. విద్యార్థులను ఇంజినీర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ అధికారులుగా తీర్చిదిద్దామని అన్నారు. అదే ఒరవడితో విద్యాబోధనను కొనసాగిస్తూ ప్రతి విద్యార్థి పైనా ప్రత్యేక శ్రద్ధ కనబరిచి విద్యాబోధనను అందిస్తున్నామని తెలిపారు. 2025లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో 23 మంది విద్యార్థులు హాజరుకాగా 23మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారన్నారు. ఐపోలవరం మండలంలోనే విద్యార్థి ఎ.సుప్రియ 600 మార్కులకు 588 మార్కులతో మొదటి స్థానం సాధించిందన్నారు. విద్యార్థినిలు డి.లాస్య, పి.జె.నైనిక 578 మార్కులతో స్కూల్లో ద్వితీయ స్థానం, విద్యార్థిని పిఎస్ ఎల్ఎన్.సాహితి 574 మార్కులతో తృతీయ స్థానం సాధించిందన్నారు.





మురమళ్లలోని శ్రీ సాయి స్కూల్



పెన్మెత్స వాసురాజు కరస్పాండెంటు



ఎ.సుప్రియ 588



డి.లాస్య, 578



పిజె.నైనిక, 578



సాహితి, 574మార్కులు

స్కూల్ ప్రత్యేకతలు

- అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన
- ఆడియో విజువల్ ప్రోగ్రామ్ ద్వారా డిజిటల్ బోర్డుపై బోధన
- చదువులో వెనుకబడిన విద్యారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ
- 3వ తరగతి నుంచి స్పోకెన్ ఇంగ్లీషు, జనరల్ నాలెడ్జ్, కమ్యూనికేషన్స్ స్కిల్స్ పై ప్రత్యేక శిక్షణ.
- నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి విద్యార్థులకు ఆటపాటలతో బోధన
- ఎన్‌సిసి, డ్రాయింగ్, సంగీతం, డ్యాన్స్, కరాటేలతో ప్రత్యేక శిక్షణ
- విశాలమైన ఆటస్థలంలో క్రీడల నిర్వహణ
- ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ఇండోర్ గేమ్స్, స్లీపింగ్ అవర్స్
- సంస్కృతి, సంప్రదాయాలపైఅవగాహనకు పండుగల నిర్వహణ
- ప్రతి నెలా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహణ
- ప్రోగ్రెస్ రిపోర్టు ద్వారా విద్యార్థుల ప్రగతి తెలియజేయుట
- జ్ఞానాన్ని పెంపొందించేందుకు లైబ్రరీ, సైన్స్‌లో అవగాహన, ప్రయోగాల నిర్వహణ
- అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, వ్యక్తిగత కంప్యూటర్ శిక్షణ
- ప్రతి క్లాస్ రూమ్‌కి రెండు ఫ్యాన్‌లు, విశాలమైన టాయ్‌లెట్స్
- ప్రతి బ్లాక్ కు మినరల్ వాటర్ సదుపాయం
- అన్ని గ్రామాల నుంచి వాహన సదుపాయం
- హ్యాండ్ రైటింగ్ స్కిల్స్ పెంపుపై ప్రత్యేక శ్రద్ధ
- విద్యార్థులపై నిరంతర పర్యవేక్షణ, తల్లిదండ్రులతో సమన్వయం

నేరాలు ఘోరాలు

బ్రాందీ షాపులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని ప్రధాన రహదారిలో ఉన్న మైత్రి వైన్స్ షాపులో బుధవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. షాపు ఇంకా తెరవకముందే, స్థానికులు షాపులో నుంచి దట్టమైన పొగ, మంటలు రావడాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు షాపు షట్టర్లు తెరిచి చూడగా, పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతున్నాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటీన చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయితే, అప్పటికే షాపులోని మద్యం బాటిల్స్ దగ్ధం అయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు లక్ష రూపాయల విలువ చేసే మద్యం బాటిల్స్ పూర్తిగా కాలిపోయాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకునిపై అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రేమ పేరుతో యువతిని మోసగించిన యువకునిపై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ, బిఎన్ఎస్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ బుధవారం తెలిపారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో గాడిలంక గ్రామానికి చెందిన యువతిని ఐ.పోలవరం మండలం పశువులంక చెందిన చింతా సురేష్ కొంతకాలంగా ప్రేమించాడు. అయితే యువతిని ప్రేమపేరుతో మోసగించాడు. పెళ్లి చేసుకోమంటే తమ కులాలు వేరని పెళ్లికి ఇంట్లో వాళ్ళు అంగీకరించరని సురేష్ మొఖం చాటేయటంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

9 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో గతంలో సారా కేసులకు సంబంధించి 9 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి బుధవారం స్థానిక తహశీల్దారు సిహెచ్.వెంకట లక్ష్మి కోర్టులో హాజరు పరిచినట్లు ఎక్సైజ్ సిఐ దుర్గా అర్జునరావు తెలిపారు. గతంలో సారా కేసుల్లో బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ.50 వేల జరిమానా విధించారన్నారు. గతంలో సారా తయారీ, సారా అమ్మకాలకు సంబంధించిన వారు ఇకపై నేరాలకు పాల్పడకుండా ఈ బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు..

నగల దొంగకు జైలు శిక్ష

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని నగరం, కాట్రావులపల్లి గ్రామాల మధ్య నగలు చోరీ చేసిన దొంగను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా 6 నెలలు జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను ఆయన బుధవారం వెల్లడించారు. 2024లో ఒక మహిళ తన భర్తతో కలిసి వేట్లపాలెం ఫంక్షన్‌కు వెళ్లి బైకుపై వస్తుండగా విశాఖపట్నం జిల్లా కంచరపాలెం ప్రాంతానికి చెందిన భీమలశెట్టి కమలనాథ్ బైక్‌తో వెంబడించాడన్నారు. అలా వారి బైక్ వెనుక వస్తూ ఆమె మెడలో ఉన్న 15 గ్రాముల మంగళ సూత్రం తాడును తెంపుకుని పరారయ్యాడన్నారు. వారి ఫిర్యాదు మేరకు అప్పుడు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితుని కోసం గాలించి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో జూనియర్ సివిల్ జడ్జి దేవీ రత్నకుమారి జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

20న జరిగే సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - యానాం

మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కేంద్రపాలిత ప్రాంతం యానాంలో జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సమ్మె ప్రాముఖ్యతను వివరించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కరోనా సమయంలో చర్చలేకుండా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను అమలుకై చేస్తున్న తీవ్ర ప్రయత్నాలను అడ్డుకునేందుకు భారత దేశంలోని యావత్ కార్మికవర్గం మే 20న సమ్మె చేయడం ద్వారానే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు యూనియన్ నాయకులు సబ్బతి రాంబాబు, తిరుకోటి శ్రీనివాస పాల్గొన్నారు.

డివిఎంసి సభ్యుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

డివిఎంసి సభ్యుల ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ అధికారి ఎంఎస్.శోభారాణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. షెడ్యూల్డు కులాల, తెగల ప్రజలపై జరుగుతున్న అత్యాచార కేసుల పరిశీలన, నివారణ చర్యలు కోసం తూర్పు గోదావరి జిల్లా విజిలెన్సు మరియు మానీటరింగ్ కమిటీ ఏర్పాటుకు సంబంధించిన ఎస్సి, ఎస్టి సామాజికవర్గాలకు చెందిన ఐదుగురు అనధికార సభ్యులను, ఎన్‌జిఒతో పని చేస్తున్న ఇతర సామాజికవర్గాలకు చెందిన ముగ్గురు సభ్యులను ఎంపిక చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు పూర్తి బయోడేటాతో పాటు, ఎస్సి, ఎస్‌టి కులధృవీకరణ పత్రాలతో 16వ తేదీ నుంచి వచ్చే నెల ఒకటో తేదీ సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. విజిలెన్సు మరియు మానిటరింగ్ కమిటీలో ప్రభుత్వేతర సభ్యులకు రెండుళ్ళు కాల పరిమితి ఉంటుందన్నారు. ఒక వ్యక్తి రెండు టెన్యూర్‌లకుమించి సభ్యత్వం వహించే అవకాశం ఉండదన్నారు.

15న ఎస్‌సి రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేస్తున్న అభ్యర్థులకు ఈ నెల 15న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. రాయితీ రుణాల కోసం మండలంలో 180 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.

రామఘట్టం వద్ద ఇసుక అక్రమ ర్యాంప్ ఏర్పాటు

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు నీళ్లు

ప్రజాశక్తి - రామచంద్రపురం

నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలోని మసకపల్లి పంచాయతీ పరిధి లో గల రామఘట్టం వద్ద అక్రమ ఇసుక ర్యాంపు ఏర్పాటైంది. వివరాల్లోకి వెళ్తే.. ధవలేశ్వరం నుంచి యానాం వరకు గల గోదావరి పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరపరాదని, తద్వారా గోదావరి పరివాహక ప్రాంతాలకు రక్షణ కల్పించాలని ఉద్దేశంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీరం వెంబడి ఇసుక తవ్వకాలను నిలిపివేసింది. అయితే ఇటీవల ఇసుక భవన నిర్మాణంలో అత్యంత ప్రాధాన్యత ఉండటంతో దీనికి మైనింగ్ శాఖ కొన్ని షరతుల తో కూడిన నిబంధనలు విధించింది. గోదావరి పరివాహక ప్రాంతంలో ఎంపిక చేసిన ర్యాంపుల్లో ప్రొక్లెయినర్ వంటి ఆధునిక పరికరాలతో ఇసుక తవ్వకాలు చేపట్టరాదని, కేవలం మనుషులతో జట్టు కూలీలతో మాత్రమే తవ్వకాలు జరపాలని నిబంధనలు విధించింది. అయితే ఇది క్షేత్రస్థాయిలో ఎక్కడ అమలు కాకపోవడంతో దీనిపై పాత కోటకు చెందిన కోటిపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, కుందూరుకు చెందిన పామర్తి బాబి హైకోర్టును ఆశ్రయించారు. ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని వారు ఫిర్యాదు చేసినట్లు 'ప్రజాశక్తి'కి వివరించారు. ప్రస్తుతం కె.గంగవరం మండలంలోని మసకపల్లి పంచాయతీ పరిధి లో గల రామఘట్టం వద్ద అక్రమ ఇసుక ర్యాంపు ఏర్పాటు చేశారు.ప్రభుత్వ అధికారులు, మైనింగ్ డిపార్ట్మెంట్, అలాగే గోదావరి ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అనుమతులు లేకుండా అక్రమ ఇసుక ర్యాంపు ఏర్పాటు చేయడంపైనా వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇసుక ర్యాంపు ఏర్పాటులో భారీ యంత్రాలతో ఉపయోగించి లారీలు వెళ్లేందుకు మార్గం సుగమం చేశారు. పరివాహ ప్రాంతాలైన పిల్లంక, పెద్దలంక, మసకపల్లి, వాసాల రేవు, కోటగుంట, పాతకోట, కోటిపల్లి, కోరుమిల్లి, కపిలేశ్వరపురం, ఆలమూరు, వేమగిరి, ధవళేశ్వరం వరకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యూటర్ నిబంధనలను పాటించకుండా అక్రమ ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేసుకుని హైకోర్టు నిబంధనలను తూట్లు హైకోర్టు నిబంధనలను పక్కన పెడుతున్నారని అన్నారు. గోదావరి పరివాహక ప్రాంతం కాపాడాలని, అక్రమ్ ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలని, భారీ వాహనాలు, ప్రొక్లెయినర్, వంటి వాహనాలు వినియోగించరాదని, గోదావరికి అడ్డుకట్టలు వేసి మత్స్యకారుల ఉపాధికి హాని కలిగించవద్దని ఫిర్యాదు దారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై హైకోర్టు దృష్టికి తీసుకువెళ్లను న్నట్లు వారు 'ప్రజాశక్తి' తెలిపారు.

రాజకీయ నాయకుల అండదండలతో ర్యాంపుల ఏర్పాటు



కె.గంగవరం మండలంలో గోదావరి పరివాహక ప్రాంతమైన పెదలంక మసకపల్లి, కోటగుంట, రామఘట్టం వాసాలరేవు పాతకోట ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఇసుక ర్యాంపులు అనుమతులు లేకుండా రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ఏర్పాటు చేస్తున్నారని దీనికి అధికారులు వత్తాసు పలుకుతున్నారు. కోర్టు అనుమతులు లేకుండా గోదావరి పరివాహక ప్రాంతంలో రాంప్లెట్ ఏర్పాటు చేయరాదని కోర్టు నిబంధనలు ఉల్లంఘించి ర్యాంపులు ఏర్పాటు చేయడంపై హైకోర్టును ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. దీనిపై కోర్టులో కేసులు ఉన్నాయి. **-కోటిపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, పాతకోట**




మసకపల్లి, రామఘట్టం మధ్యలో ఏర్పాటు చేసిన ఇసుక అక్రమ ర్యాంపు

ఇసుక అక్రమ ర్యాంపులపై సిఎంకు ఫిర్యాదు



వి.వి.రామరాజు

రామచంద్రపురం: గోదావరి పరివాహక ప్రాంతాలైన మసకపల్లి, వాసాల రేవు, రామఃఘట్టం తదితర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారని రామచంద్రపురం చెందిన ప్రజాస్వామిక వాది వివి.రామరాజు సిఎం చంద్రబాబుకు ఈ నెల 14న ఫిర్యాదు చేశారు. ఇసుక ర్యాంపు పైన హైకోర్టులో కేసులు ఉన్నాయని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు ఉల్లంఘించి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టడంపై ఆయన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు కాపీలను ఆయన మీడి యాకు విడుదల చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలు నిలిపివేయాలని గోదావరి పరి రక్షణ కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


గౌరవనీయులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు
ఆంధ్రప్రదేశ్, అమరావతి వారి దివ్యసముఖమునకు.

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణ కాపురస్తులు యర్రంశెట్టి వి.వి.ఎస్. రామరాజు వ్రాసుకొను విన్నపములు.

అయ్యా,

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోట, భట్లపాలిక, మసకపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న గౌతమి గోదావరినదీ పరివాహక ప్రాంతాలలోనే కాకుండా ఎన్.జి.టి. వారు జియోగ్రాఫికల్ సర్వే ద్వారా కోస్టల్ ఏరియాగా గుర్తించిన గోదావరి నదీ పరివాహక ప్రాంతాలలో ఎక్కడపడితే అక్కడ ఇసుక ర్యాంప్‌లు ఏర్పాటు చేసి ఇసుక త్రవ్వకాలు జరుపుట వలన నీటి ప్రవాహానికి ఇబ్బంది కలుగుతుందని, పర్యావరణం దెబ్బతింటుందని, వరదలు వచ్చునపుడు అనేక ఇబ్బందులు కలుగవచ్చునని, సముద్రము నుండి గోదావరి పైకి వచ్చే ఆటుపోటులకు అంతరాయం కలుగునని, మత్స్య సంపద తగ్గిపోతుందని, ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని, 2019 న్యూ మైనింగ్ పాలసీ ప్రకారం ఇసుక త్రవ్వకాలు మాన్యువల్‌గానే చేయాలని, మిషనరీతో ఏవిధమైన త్రవ్వకాలు చేయకూడదని దాని వలన రైల్వే బ్రిడ్జి వంటి నిర్మాణాలు కూడా కూలిపోతాయని, మత్స్యకారులు కూడా జీవనోపాధి కోల్పోతారని సదరు విషయమై జిల్లా కలెక్టర్ వారు సంబంధిత అధికారులతో కమిటిని వేసి వారి సమక్షములో నిరంతరం పర్యవేక్షణ చేయాలని ది.27-09-2022 తేదిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సదరన్ జోన్‌వారు యిచ్చిన ఆదేశాలను ప్రక్కన పెట్టి ఏవిధమైన ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇటీవల కె.గంగవరం మండలం కోట, భట్లపాలిక, మసకపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న గౌతమి గోదావరి నదికి సంబంధించి ఏటిగట్టు వెంబడి ఉన్న ప్రాంతాలలో అక్రమ ఇసుక త్రవ్వకాలు జరుపుతున్నారు. సదరు ప్రాంతాలలో జరుగుతున్న అక్రమ ఇసుక త్రవ్వకాలపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో నేను రిట్ పిటిషన్ నెం.4781/2023 వేసియున్నాను.

కావున తమరు ఇప్పటికైనా యీ యొక్క అక్రమ ఇసుక ర్యాంపును నిలుపుదల చేసి మా ప్రాంత పర్యావరణాన్ని, గ్రామాల పరిరక్షణను, మత్స్యకారుల జీవనోపాధిని కాపాడవలసినదిగా కోరి ప్రార్థించుచున్నాము.


రామచంద్రపురం
ది.14-05-2025

ఇట్లు
తమ విధేయులు
Y.V.V.S. Ramaraju

సిఎంకు ఫిర్యాదు చేసిన కాపీ

డిసిఎంఎస్ ఛైర్మన్ చంద్రమౌళికి అభినందనలు

ప్రజాశక్తి - కొత్తపేట



అభినందనలు తెలుపుతున్న నాయకులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్‌గా నియమితులైన పెచ్చెట్టి చంద్రమౌళిని కొత్తపేట మండల బీసీ నాయకులు రెడ్డి రామకష్ణ గుబ్బల మూర్తి అభినందనలు తెలియజేశారు. అమలాపురం మండలం పేరూరు గ్రామం లోని ఆయన స్వగృహానికి వెళ్లి ఈ సందర్భంగా ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. చంద్రమౌళి పార్టీకి అందించిన సేవలను గుర్తించి ఆయన డిసిఎంఎస్ ఛైర్మన్ పదవి కేటాయించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. ఇదే తరహాలో బిసిలకు మరింత మందికి న్యాయం చేయాలని పదవులు కేటాయించవలసిన అవసరం ఉందన్నారు.

డాక్టరేట్‌కు చిట్టీబాబు ఎంపిక

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అప్లైడ్ మాథ్స్ లో చేసిన పరిశోధనలకు ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కందికట్ల చిట్టిబాబును డాక్టరేట్‌కు ఎంపికైనట్లు గీతం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నుంచి ఉత్తర్వులు అందాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం గీతం యూనివర్సిటీ నుంచి క్రిప్టోగ్రఫీ నెంబర్ థియరీలో 'నోవెల్ క్రిప్టోగ్రఫీ టెక్నీక్యూస్ ఫర్ సెక్యూర్ ఆన్ లైన్ ఓటింగ్ ఎండ్ టు ఎండ్ డేటా ఎక్సంజ్' అను అంశంపై చేసిన పరిశోధన లకు డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ఈ పరిశోధన లో యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. తలారి సురేంద్ర, మరియు రిటైర్డ్ ప్రొఫెసర్ ఎ చంద్రశేఖర్ లు రీసెర్చ్ గైడ్‌లుగా వ్యవహరించారు. చిట్టిబాబు ను డాక్టరేట్‌కు ఎంపిక చేస్తూ ఉత్తర్వులు రావడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్, అధ్యాపకులు, అధ్యాపకేతర హర్షం వ్యక్తం చేశారు.

నలుగురికి గ్రేడ్-5 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలో నలుగురు సచివాలయ గ్రేడ్-6 కార్యదర్శులు (డిజిటల్ అసిస్టెంట్) లకు గ్రేడ్-5 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి లభించింది. ఇటీవల గ్రేడ్-5 కార్యదర్శిలు, గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి పొందిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ మండలంలో పనిచేసే నలుగురికి గ్రేడ్-6 కార్యదర్శులను, గ్రేడ్ -5 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు బుధవారం కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన కౌన్సిలింగ్‌లో వారికి గ్రేడ్-5 స్థానాలను కేటాయించారు. బడుగువానిలంక గ్రేడ్-6 కార్యదర్శి శివకుమార్ ను మడికి సచివాలయం-2 కు నియమించగా, జొన్నాడ సచివాలయం-1 లో పనిచేసే గుత్తుల అమత వర్షినీ రావులపాలెం సచివాలయం-4 కార్యదర్శిగా నియమించారు. అలాగే నర్సిపూడి సచివాలయం - 1లో పనిచేసే హేమంత్ కుమార్‌ను మూలస్థానం-2 కి నియమించగా, చొప్పెల్ల 1 లో పనిచేసే ప్రసన్న కుమార్‌ను ఆత్రేయపురం మండలం పులిదిండికి నియమించారు. ఈ ఉద్యోగోన్నతులు పొందిన కార్యదర్శులను ఆలమూరు ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జడ్‌పిటిసి సభ్యురాలు తోరాటి సీతామాలక్ష్మి, రాంబాబు, ఎంపిడిఒ ఎ.రాజు తదితరులు అభినందించారు.

వీరబాబును పరామర్శించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - కొత్తపేట



పరామర్శిస్తున్న నాయకులు

పితృ వియోగంతో బాధపడుతున్న కొత్తపేట నీటి సంఘం అధ్యక్షులు బండారు వీరబాబును కొత్తపేట టిడిపి నాయకులు రెడ్డి రామకృష్ణ, గుబ్బల మూర్తి, ముద్రగడ సుబ్బారావు బుధవారం వాడపాలెం గ్రామంలోని ఆయన స్వగృహం వద్ద పరామర్శించారు. ఈ సందర్భంగా వీరబాబు తండ్రి బండారు ముసలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

టిఐఐకెఎంతో నన్నయ ఎంఒయు

ప్రజాశక్తి - రాజానగరం

శ్రీలంకకు చెందిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ (టిఐఎస్ కెఎం)తో నన్నయ యూనివర్శిటీ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బుధవారం యూనివర్సిటీ ఇసి హాల్లో టిఐఎస్‌కెఎం వ్యవస్థాపకుడు ఇసాంక పి గమగే సహ విసిఆచార్య ఎస్.ప్రసన్న శ్రీ ఎంఒయు పత్రాలపై సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఈ ఎంఒయుతో అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ, జాయింట్ రీసెర్చ్, జాయింట్ కాన్ఫరెన్సెస్, వెబీనార్స్ వర్క్ షాప్స్ ట్రెనింగ్ ప్రోగ్రామ్స్, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్, జాయింట్ డిగ్రీ ప్రోగ్రామ్స్, కమ్యూనిటీ సర్వీసెస్, పబ్లికేషన్ సపోర్ట్ సర్వీసెస్ వంటి పరస్పర సహకారం లభిస్తుందన్నారు. భవిష్యత్తులో ఎంఒయు ద్వారా అధ్యాపకులు, విద్యార్థులు లబ్ధి పొందాలని విసి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ వి.పెర్సిస్ ఐ.క్యూ.ఎసి, డాక్టర్ మొరవాక ధమ్మరఖిత థెరో, పాలీ బౌద్ధ అధ్యయనాల విభాగం, శ్రీలంక చెందిన హ శ్రీ జయవర్ధనేపుర విశ్వవిద్యాలయం అధ్యాపకులు ప్రొఫెసర్ నిమాలి తక్షిలా వితనాగే తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రైల్వే కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాల్సిన 4 నెలల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వివిఎల్.నరసింహులు, జిల్లా కార్యదర్శి బివిఎన్.పూర్ణిమరాజు డిమాండ్ చేశారు. బుధవారం రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ రోహిత్‌ను కలిసి బకాయి వేతనాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే కాంట్రాక్టు శానిటరీ వర్కర్స్‌కు ఇవ్వాల్సిన 4 నెలల బకాయి వేతనాలు ఇవ్వాలని, అలాగే పెరిగిన వేతనాలను డిఎతో కలిపి చెల్లించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరారు. దీనిపై హెల్త్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ బకాయి వేతనాల అంశం కోర్టు పరిధిలో కేసు ఉందని, అది తేలిన వెంటనే చెల్లిస్తామని తెలిపారు. అనంతరం కార్మికులతో జరిగిన సమావేశంలో పూర్ణిమ రాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాచేలా 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, రైల్వేలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రైల్వే ప్రయివేటీకరణ ఆపాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, రైల్వేలో నిరుద్యోగులకు నూతన ఉద్యోగాలు కల్పించాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, నూతన పెన్షన్ స్కీమ్ రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.



రక్షిత మంచినీటి ట్యాంక్ 'ఇన్‌సెట్‌లో పాడైపోయిన మెట్ల స్తంభం

శిథిలావస్థకు చేరిన రక్షిత మంచినీటి పథకం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని పేరవరం గ్రామంలో వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం రైలింగ్, మెట్లు, మెట్ల స్థంభం శిథిలావస్థకు చేరింది. రక్షిత మంచినీటి పథకం ఊచలు బయటపడి మెట్లు సిమెంటు పెచ్చులు ఊడిపోవడంతో ప్రమాదకరంగా ఉంది. వాటర్ ట్యాంక్ మీద పిచ్చి మొక్కలు మొలుస్తున్న వాటిని పట్టించుకుని నాథుడే కురవయ్యాడు. పంచాయతీ సిబ్బంది వాటర్ ట్యాంక్ ను శుభ్రం చేయడానికి పైకి ఎక్కేటప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందని భయాందోళన చెందుతున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు పంచాయతీ అధికారికి ఎన్నిసార్లు విన్నవించుకున్న వారు పట్టించుకున్న దాఖలు లేవని వారు చెబుతున్నారు. గ్రామానికి ఈ రక్షిత పథకం ద్వారానే తాగునీరు అందుతుంది.

పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశాం

పేరవరం రక్షిత మంచినీటి పథకం మెట్లు రైలింగ్ శిథిలావస్థకు చేరడం తో వాటర్ ట్యాంక్ క్లీనింగ్ చేయడానికి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే మెట్లకి రైలింగ్‌కు మరమ్మతులు చేయించాలని పంచాయతీ కార్యదర్శి వెంటనే ఆదేశాలు జారీ చేశామని పంచాయతీ విస్తరణ అధికారి కె.చంద్రశేఖర్ అన్నారు. వెంటనే పనులు చేపడతామన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని అన్నవరప్పాడులో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం తీపర్రు గ్రూప్ టెంపుల్స్ అధికారి ఎంవి.రామయ్య పర్యవేక్షణలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 69 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.7,14,380, అన్నదాన హుండీ ద్వారా రూ.16,903 మొత్తం రూ.7,31,283 ఆదాయం వచ్చినట్లు రామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారి ఎం.రాధాకృష్ణ, సిబ్బంది శ్రీవారి, సేవకులు, గ్రామస్తులు పాల్గొన్నారు

ఎంటియు 1318 రకం విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండల రైతులకు అవసరమైన ఎంటియు 1318 రకం ఫౌండేషన్ విత్తనాలను మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఎం.విశ్వాసరావు బుధవారం తెలిపారు. 25 కిలోల ప్యాకింగ్ ధర రూ.1050 ఉంటుందన్నారు. అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమ్మకాలు కొనసాగుతాయని, ఆన్‌లైన్ చెల్లింపులు చేయవచ్చని తెలిపారు. మరిన్ని విషయాల కొరకు శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.వెరోనిక సెల్ 8985059378ను సంప్రదించవచ్చన్నారు.

రోడ్డుపై ఇసుకను వెంటనే తొలగించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం నుంచి రాజమహేంద్రవరం వచ్చే మెయిన్ రోడ్డుపై ఉన్న ఇసుకను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం డివైఎఫ్ఐ బృందం సాయిబాబా గుడి నుంచి ఐఎల్‌టిడి సెంటర్ వరకు ఉన్న రోడ్డును పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి బండ్ రోడ్డులో 7 ఇసుక ర్యాంపులు ఉన్నాయని, ఆ ర్యాంపుల నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది లారీలతో ఇసుకను రవాణా చేస్తున్నారని అన్నారు. లారీలపై నుంచి ఇసుక కింద పడకుండా రవాణా చేయాల్సివుందని, అయితే బరకాలను కప్పకుండా రవాణా చేయడం వల్ల రోడ్డుకు ఇరువైపులకు పడిపోతుందన్నారు. రోడ్డుపై ఇసుక పడటంతో వాహనదారులు జారీపోయి ప్రమాదాల భారిన పడుతున్నారని అన్నారు. ఇసుక లారీలకు సిటీలోకి అనుమతి లేదని చెబుతున్నా ఆచరణలో అమలు కావడం లేదని తెలిపారు. కావున స్థానిక అధికారులు, నగర పాలక సంస్థ కమిషనర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాడ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలను సమీకరించి ధర్నా చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు టి.రాజేష్, సిఐటియు నాయకులు. బి.పూర్ణిమరాజు స్థానిక ప్రజలు జి.రంగస్వామి, వంశీ,పండు, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ కృషి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం జాతీయ మానవ హక్కుల కమిషన్ కృషి చేస్తుందని కమిషన్ సభ్యురాలు విజయ భారతి సయాని అన్నారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికా రులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల విషయంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం పరంగా అందించాల్సిన సేవలు విషయంలోనూ కమిషన్‌ను సంప్రదించ వచ్చని తెలిపారు. ఇప్పటి వరకు 39 గిరిజన వసతి గృహాలు, ఎస్‌టి కాలనీలు, పాఠశాలలు, మండల రెవెన్యూ కార్యాలయాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, వారి సమస్యలను తెలుసుకున్నామని, వాటి పరిష్కారానికై కమిషన్ పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పింఛన్లు అందక బాధపడుతున్న బాధితులకు పింఛన్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామని, మహిళల గౌరవానికి, భద్రతకు ఎటువంటి భంగం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల ఇబ్బందులను సుమోటోగా స్వీకరిస్తామని చెప్పారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు జిల్లాల పర్యటన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించే విషయంలో ప్రభుత్వ అధికారులు స్పందించక పోతే ఎన్‌హెచ్‌ఆర్‌సికి నేరుగా అర్జీలు పెట్టుకోవచ్చునని అన్నారు. జాతీయ మానవ హక్కుల సంఘం స్వయం ప్రతిపత్తి సంఘమని,దీనికి ఏ రాష్ట్రంలోనూ అనుబంధ సంఘాలు లేవని స్పష్టం చేశారు. నేరుగా మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయలేని వారు ఆన్‌లైన్ ద్వారా nhrc.net నేరుగా ఫిర్యాదులు చేసుకోవచ్చునని తెలిపారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే మేళాలు

ప్రజాశక్తి - చాగల్లు

అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రత్యేక మేళాలు నిర్వహిస్తున్నామని సిడిపిఒ సిడిపిఒ డి.మమ్మీ తెలిపారు. బుధవారం చాగల్లు మండలంలోని 67, 68, 69, 70 అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులతో పత్యేక మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి పాల్గొని మాట్లాడారు. అన్ని కేంద్రాల్లో స్కూల్ ట్రెడినెస్ మేళా అనే కార్యక్రమాన్ని నిర్వహించి 3 నుంచి 5 సంవత్సరాలు నిండిన ప్రీస్కూల్ పిల్లలను ఆయా సమీప పాఠశాలకు ప్రమోట్ చేయాలని అన్నారు. సెక్టార్ సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులను శారీరక, మానసిక, భావోద్వేగాలను అభివృద్ధి చేస్తూ వారిలో నైపుణ్యాన్ని వెలికి తీయాలని సూచించారు. తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారుల గ్రాడ్యుయేషన్ దేని ఘనంగా నిర్వహించారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా నాగరాజు

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా వి.నాగరాజు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మండూరు బ్యాంకు మేనేజర్‌గా పని చేస్తున్న నాగరాజు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసిన ఇంద్రజిత్ బదిలీపై వెళ్లారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పనే తమ లక్ష్యమని స్పెషల్ ఆఫీసర్, ఆర్ఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. బుధవారం ఆయన హుకుంపేట, శాటిలైట్ సిటీ పంచాయతీలలో పర్యటించారు. వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరా, డ్రెయినేజీ వ్యవస్థపై ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీలలో ఉన్న కుళాయి కనెక్షన్లు, ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ సదుపాయంపై ఆరా తీశారు. వంద శాతం కనెక్షన్లను నిర్వహణలోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే సచివాలయాల పరిధిలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టవలసిన పనులను గుర్తించేందుకు ఓ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. రోడ్లకి ఇరువైపులా ఎక్కడా చెత్తకుప్పలు ఉండకుండా.. ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఆయా పంచాయతీల్లో డ్రెయినేజీ, తాగునీరు, పారిశుధ్య సమస్యలను ప్రధానంగా గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.